డ్రైనేజీ సమస్య పరిష్కారం

అంబర్‌పేట్: ప్రధాన రోడ్డుపై తీవ్ర సమస్యగా మారిన డ్రైనేజీ సమస్యను అర్ధరాత్రి స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, జలమండలి అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా కొద్దిరోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో వాహనాదారులు, స్థానికులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాలతో బుధవారం అర్ధరాత్రి బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, నర్సింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, అనిల్‌కుమార్‌లు, జలమండలి మేనేజర్ రోహిత్‌తో కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

ఇళ్లు కూల్చినచోటే ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని దీక్షలు

చిక్కడపల్లి: డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బస్తీవాసులు గురువారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ 39 రోజులుగా దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికీ పట్టించుకోకపోతే ఆమరణ నిరాహారదీక్షలకు బాధితులు సిద్ధంగా ఉన్నారని, వారికి తాము మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. ఇళ్ళను కూల్చిన చోటే ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రిలే నిరాహారదీక్షలు చేపడతామని బస్తీ ప్రధాన కార్యదర్శి ఎం.బి.కృష్ణ అన్నారు. రిలే నిరాహార దీక్షకు కూర్చున్న ఎంబీ కృష్ణకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నేతలు ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, భారతి, సువర్ణ, సునీత, పూజ, సాయిరాం, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలపై కొనసాగుతున్న వివక్ష
- రక్షణ కూడా కరువు

ఇంతింతై..!

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి అవకాశాలను వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇంకా కొన్నిచోట్ల మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. వారికి రక్షణ కూడా కరువైంది. శుక్రవారం(నేడు) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ మనోగతాలను 'సాక్షి'తో పంచుకున్నారు. పలువురు మహిళల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

–నల్లకుంట

పేదలకు వైద్యం అందించడంలోనే ఆనందం



వివిధ రుగ్మతలతో బాధపడుతూ బస్తీలు, మురికి వాడల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజల ఆరోగ్య సమస్యల్ని సావధానంగా వింటూ వారికి వైద్యం చేయడంలో ఎంతో ఆనందంగా ఉంటోంది. ఒక్కోసారి క్లిష్టమైన కేసులూ వస్తుంటాయి. వాటికి పరిష్కారం చూపడంతో సంతృప్తి కలుగుతోంది.

– డాక్టర్ జయలక్ష్మి, ఫీవర్ ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో

పరస్పర సహకారం అవసరం



స్త్రీలను తమతో సమానంగా చూస్తూ పురుషులు మరింత సహకారం అందించాలి. ఇళ్లల్లోనూ, పనిచేసేచోట పురుషులు, మహిళలు పరస్పర సహకారం అందించుకుంటే మరింత ముందుకు వెళతారు. మహిళలు ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో దూసుకెళ్లిపోతున్నారు.

– యశస్విని, సరస్వతి సంగీత విద్యాలయం, మ్యూజిక్ టీచర్

ఆత్మవిశ్వాసమే ఆయుధం కావాలి



కుటుంబం బాగుండాలంటే ఇంటి దీపమైన ఇల్లాలు బాగుండాలి. చిన్న చూపు చూస్తున్న వారిని ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసమే ఆయుధం కావాలి. ముందుగా మహిళ తన శక్తిని తాను గుర్తించాలి. ఆత్మన్యూనతా భావనను త్యజించాలి.

– సీహెచ్ లలిత, మగ్గం వర్క్స్

పెంపకంలో సమానత్వం చూపాలి



చాలామంది తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో వివక్ష చూపుతున్నారు. ఆడ, మగ పిల్లలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆడపిల్లల్లోని అంతర్గత శక్తిని వెలికి తీసి ప్రోత్సహించినప్పుడే వారు రాణించగలరు.

– డాక్టర్ శివజ్యోతి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫిజియో థెరపీ కళాశాల

విద్యతోనే మహిళా వికాసం



ఆడపిల్లను తల్లిదండ్రులు విధిగా చదివించాలి. వారు ఉన్నత చదువులు చదివినప్పుడే మహిళాసాధికారత సాధ్యం అవుతుంది. నిర్ణయాధికారంలో స్త్రీ భాగస్వామి కాగలిగినప్పుడే అసమానతలు, అంతరాలు తొలగిపోతాయి.

– డాక్టర్ ఎం.ధనేశ్వరి, చిల్డ్రన్స్ డెంటల్ స్పెషలిస్టు

కఠినచర్యలతోనే హింసకు అడ్డుకట్ట



మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలున్నా వారిపై ఇంకా అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. నిర్భయ చట్టం తెచ్చినా ఎక్కడా దాడులు, హింసలు ఆగడంలేదు. వ్యవస్థలోని లోపాలు సరిదిద్దాలి. నిందితులకు కొమ్ము కాసే అధికారులు, రాజకీయ నాయకులపై కఠిన చర్యలు చేపట్టాలి.

– దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

నల్లకుంట: మహా శివరాత్రి, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం(నేడు) దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత దంత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలలో గల దత్తసాయి దంత వైద్యశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. 92463 66944కు ఫోన్ చేసి ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి యాదాద్రి అఖండ జ్యోతి యాత్ర

అంబర్‌పేట్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 8 నుంచి 11 వరకు శ్రీలక్ష్మి నరసింహస్వామి 30వ అఖండ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నట్లు యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని యాదాద్రి భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం బర్కత్‌పుర యాదాద్రి భవనం నుంచి ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్ర 11న యాదాద్రికి చేరుకుంటుందన్నారు. సమావేశంలో అఖండ జ్యోతియాత్ర కమిటీ ఉపాధ్యక్షులు దుగ్యాల పవన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పడాల శ్రీకాంత్, అసిస్టెంట్ కార్యదర్శి ఎన్.ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం



అంబర్‌పేట్: బస్తీల్లో పైపులైన్ వ్యవస్థ పటిష్టానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం అంబర్‌పేట్ డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్‌లను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా సమన్వయంతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానికంగా పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళాసంఘాలపై దాడిని ఖండించండి

ముషీరాబాద్: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మార్చి 6న మహిళా సంఘాలు సంయుక్తంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా పోలీసులు దౌర్జన్యంగా మహిళల చేతుల్లోని ప్లకార్డులు, జెండాలు తొలగించి దాడి చేయడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ తీవ్రంగా ఖండించారు. ఆందోళనకు హాజరవుతున్న కొంత మందిని దారిలోనే అడ్డగించి పోలీస్‌స్టేషన్‌లలోకి తరలించారని, మహిళా కార్యకర్తలపై హింసకు పాల్పడ్డారని ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శాంతియుతంగా సమావేశం అయ్యే ప్రజాస్వామిక హక్కులను పోలీసులు కాలరాయడం సిగ్గుచేటు అని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రవీణ్‌కుమార్‌కు క్షమాపణ చెప్పకుంటే ఇల్లు ముట్టడి

– మంత్రి కొండా సురేఖను హెచ్చరించిన వంగపల్లి

ముషీరాబాద్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ని రౌడీ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ తక్షణమే క్షమాపణలు చెప్పాలని లేకుంటే ఇల్లు ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ హెచ్చరించారు. గురువారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో పార్టీ పొత్తులనేవి సహజమని, అంత మాత్రానికే ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని రౌడీ అంటూ బహిరంగంగా సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో శ్రీనన్న, రమేష్, శ్రీనివాస్, హుస్సేన్, యాదగిరి, కృష్ణ, వరలక్ష్మి, గణేష్, వెంకటేష్, నర్సింహ్మ, వెంకట్, హాసన్ తదితరులు పాల్గొన్నారు.

'భార్యల మెయింటెనెన్స్ ఫండ్' సేకరణ

- బిక్షాటన చేసిన 'సేవ్ ఇండియన్ ఫ్యామిలీ'నేతలు
- కారణాలు లేకుండా భర్తలపై కేసులు పెట్టొద్దని డిమాండ్
- ధర్నాచౌక్‌లో 'ఉమెన్స్ డిగ్నిటీ డే'



మహిళల మెయింటెనెన్స్ ఫండ్ పేరిట భిక్షాటన చేస్తున్న ఇండియన్ ఫ్యామిలీ నేతలు

కవాడిగూడ: సేవ్ ఇండియన్ ఫ్యామిలీ సంస్థ నేతలు భార్యల మెయింటెనెన్స్ ఫండ్ పేరిట భిక్షాటన చేసి వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. కారణాలు లేకుండా కొంతమంది మహిళలు ఇష్టం వచ్చినట్లు భర్తలపై కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని, ఈ ధోరణిని మానుకోవాలని కోరారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సేవ్ ఇండియన్ ఫ్యామిలీ హైదరాబాద్ చాప్టర్ కౌన్సెలర్ కృష్ణారావు, సభ్యులు జునేద్, మునీర్, విజయ్, ఇనాయత్ తదితరులు మాట్లాడారు. మార్చి 8న మహిళా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఉమెన్స్ డిగ్నిటి పేరిట కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కొంతమంది చదువున్న మహిళలు, ఉద్యోగాలు చేసే వారు సైతం భర్తలపై కేసులు పెట్టి వారి వద్ద నుంచి మెయింటెనెన్స్ చార్జీలు రాబట్టాలని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు కనువిప్పు కలిగించేందుకు నగరంలోని ప్రధాన చౌరస్తాలలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్న పాటి గొడవలకే మహిళా పోలీస్ స్టేషన్‌లో 498 ఏ కేసులు పెట్టి మెయింటెనెన్స్ డబ్బుల కోసం పలు విధాలుగా వేధిస్తున్నారని, అలాంటివారికి న్యాయవ్యవస్థ కూడా సహకరిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై న్యాయవ్యవస్థ ఆలోచించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఇండియన్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు.. 'బ్రదర్'



నల్లకుంట: తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుడైన బ్రదర్ దీపక్ జాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్, ఇండో-ఇజ్రాయల్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆడం రాజేలు దీపక్‌జాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగవల్లులు



అంబర్‌పేట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరిగింది. గురువారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ మహిళాసిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంసీ మారుతీదివాకర్, యూసీడీ అధికారి రజిత విచ్చేసి విజేతలను అభినందించారు.

శుభాకాంక్షలు



సాక్షి, సిటీబ్యూరో: ఐఎన్‌టీయూసీ అనుబంధ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (3194) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం ఐపీఎం యూనిట్ అధ్యక్షుడు రాసురి జ్ఞానేశ్వర్ , కోశాధికారి రాపోలు నరేష్‌లు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

నల్లకుంట: రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వేగంగా దూసుకు వచ్చిన ఓ ఎలక్ట్రిక్ కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం మధ్యాహ్నం ఓ వృద్ధుడు కారులో ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా నుంచి శంకరమఠంవైపు వస్తున్నారు. అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్ ఎదురుగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపైకి చేరుకున్న కారు మలుపు వద్ద ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్ క్రేన్ సహాయంతో ఆ కారును అక్కడి నుంచి తొలగించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. కారు నడుపుతున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు.

కమ్యూనిటీ హాల్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి



చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కనీస సౌకర్యాలను కల్పించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ కార్యాలయంలో ఆమె కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీహాల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మసీదుల వద్ద ఇబ్బందుల్లేకుండా చర్యలు



ముషీరాబాద్: రెండు రోజుల్లో ప్రారంభం కానున్న రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో జలమండలి, విద్యుత్, జీహెచ్‌ఎంసీ, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ మసీదుల పెద్దలతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదుల వద్ద మంచినీరు, విద్యుత్ సరఫరాల్లో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్య సమస్య తలెత్తకుండా చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. రోడ్లపై అవసరమైన చోట వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కోరారు. అక్రమ పార్కింగ్‌లపై పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ సొసైటీ చైర్మన్ అక్తర్ అలీ, ఐరన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదం అలీ, బడీ మసీదు ముక్తవల్లీ నజీర్‌అలీ, బిలాల్ మసీద్ ముక్తవలీ దిల్‌బర్ హుస్సేన్, జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎంలు మోహన్‌రాజ్, కార్తీక్‌రెడ్డి, ఏఈ ప్రసాద్‌బాబు, జీహెచ్‌ఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి, స్ట్రీట్ లైట్ ఏఈ జ్యోతిర్మయి, జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రహీం, మహ్మద్ అలీ, జహీరుద్దీన్ సమర్, జహంగీర్, అక్లక్ హుస్సేన్, జావిద్‌ఖాన్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నల్లకుంట: మహిళలు అన్ని రంగాలలోనూ అభివృద్ధి సాధించాలని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్ ఆకాంక్షించారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎంహెచ్‌ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన డాక్టర్ శంకర్ మాట్లాడారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ వై.అమృత, ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ యాదిలాల్, మేట్రిన్ విజయలక్ష్మి, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, టీఎంహెచ్‌ఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు పద్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మహిళా సిబ్బందిని సన్మానించారు.

పరీక్షలకు ఉచిత కోచింగ్, వసతి కల్పించాలి

- పేపర్ లీకేజీల వల్ల రద్దైన పరీక్షలతో ఇబ్బందులు
- కొన్నేళ్లుగా ఫీజులు కట్టి నష్టపోయిన అభ్యర్థులు



మాట్లాడుతున్న ఆనగంటి వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచిత వసతి సౌకర్యాలు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో గ్రూప్-1, 2, 3, డీఎస్సీ నోటిఫికేషన్లు, పరీక్ష తేదీలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్స్ ఇచ్చినప్పటికి పరీక్షలలో పేపర్ లీకేజీల వల్ల పరీక్షలు రద్దయ్యాయని, ఇప్పటికే గత కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగులు ఫీజులు కట్టి కోచింగ్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంకా సంవత్సరం వరకు చదవాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువత కోచింగ్ ఫీజులు కట్టడానికి, వసతి ఏర్పాటుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు చేసి చదువుకుంటున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువు

– ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

ముషీరాబాద్: రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వర్యంగా మారిందని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోరం బొంద ప్రభుత్వ పాఠశాలను విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్‌లు స్వరూపారాణిలతో కలిసి డాక్టర్ కె.లక్ష్మణ్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తన ఎంపీ నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, టీచర్ల కొరత వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్, స్కూల్ కార్యదర్శి రత్నం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాబేర్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల రోడ్డు సమస్య పరిష్కారం



ముషీరాబాద్: భోలక్‌పూర్ హౌస్ వద్ద అధ్వానపు రోడ్డుతో గత 30 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మోడల్ రోడ్లు వేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌస్ వద్ద రూ.56 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే భోలక్‌పూర్ హౌస్ వీధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేశామన్నారు. శివరాత్రి పండుగకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శివాలయాల వద్ద ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, భోలక్‌పూర్ హౌజ్ అధ్యక్షుడు కె.ఎం.శంకర్, నాయకులు ఆర్.శ్రీనివాస్, సాయి, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

విలువలతోనే న్యాయవాదవృత్తిలో రాణింపు



ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్న జస్టిస్ జి.రఘురామ్

చిక్కడపల్లి: న్యాయవాదులు సామాజిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురామ్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో నిర్వహించిన వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే విలువలను పాటించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసేందుకు అధ్యాపకులు ప్రోత్సహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయవిభాగం అధిపతి ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి అన్నారు. వాసవి విద్యాసంస్థల అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అరవింద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ లేకుండా పోస్టులు భర్తీ చేయాలి

– ఆర్.కృష్ణయ్య డిమాండ్



కవాడిగూడ: పీజీటీ పోస్టులను భర్తీ చేయడం వల్ల మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఆర్ఇఐ-ఆర్‌బీ వెలువరించిన అన్ని నోటిఫికేషన్లలో పై నుంచి కింది స్థాయి పోస్టులను భర్తీ చేసి అందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు అన్ని శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గురువారం ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌లో బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా 9,210 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ గురుకుల అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒక్కో అభ్యర్థి నాలుగు పోస్టులకు ఎంపిక కావడం వల్ల మిగతా మూడింటిని బ్యాక్‌లాగ్ పోస్టులుగా నిర్ణయించిందని, దీని వల్ల మెరిట్ అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో పాటు గురుకుల బోర్డు స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ ధర్నాలో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేత దత్తాత్రి, గురుకుల టీచర్స్ అభ్యర్థులు సైదులు, ఎ.రాజు, అశోక్, జయశంకర్, సత్యనారాయణ, కాంతారావు, ఆస్మాతోపాటు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐక్యతతోనే గంగపుత్రుల అభివృద్ధి సాధ్యం

కవాడిగూడ: రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించేందుకు గంగపుత్రులు అందరూ ఐకమత్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి పిలుపునిచ్చారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షుడు ఆర్‌కే భగవాన్, కోశాధికారి ఎర్రబోయిన మల్లేష్, ఉపాధ్యక్షులు గడప శంకర్, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్రులు హాజరై ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీని ప్రకటించారు. తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా రాచమళ్ల స్వర్ణలత, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదవీలత, ప్రధాన కార్యదర్శులుగా చెరక సంగీత, మంగినపల్లి సునీత, ఉపాధ్యక్షురాళ్ళుగా కూర పద్మ, గడ్డం మంజుల, తాండ్ర లత, గొంగిడి శ్రీలక్ష్మిలను ఎన్నుకున్నారు.

